క్లుప్తంగా

దేవీచౌక్ ఆలయంలో పూజలు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మను వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బంగారు వరలక్ష్మీ కానుక పేరుతో కంబాల శ్రీనివాస్‌రావు దంపతులు 50 మంది మహిళలకు ఒక్కొక్కరికీ గ్రాము బంగారు రూపులను లక్కీ డ్రా ద్వారా ఇవ్వనున్నట్టు ప్రకటించడతో మహిళలు వరలక్ష్మీవ్రతానికి భారీ సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

రేపటి నుంచి ఆలయ పునర్నిర్మాణం



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో కోదండ రామాలయం పునర్నిర్మాణ పనులను ఆదివారం నుంచి ప్రారంభిస్తామని దేవదాయ, ధర్మదాయశాఖ డీఈ గూడపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శుక్రవారం ఆ ఆలయ పునర్నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ ఆదాయం రూ.20 లక్షలు, దేవదాయశాఖ నిధులు రూ.40 లక్షలతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, కాండ్రు వీరన్న పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి సన్మానం




సీతానగరంలో మాజీ సైనికుడికి సన్మానం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరేరామ్ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం చినకొండేపూడికి చెందిన ఆర్మీ విశ్రాంత అధికారి జి.శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆర్మీ అధికారి శ్రీనివాస్ అప్పటి రాష్ట్రపతి ఇంద్రకుమార్ గుజ్రాల్ చేతుల మీదుగా శౌర్య పతకం అందుకున్నారు. ఆయనను ఘనంగా సన్మానించిన అనంతరం విద్యార్థులకు దేశభక్తి – యువత – భవిష్యత్తు అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.సుధామయి, తులసీ కుమారి, డాక్టర్ మాధవ్ పాల్గొన్నారు.

పల్మనాలజీకి ఎంతో ప్రాధాన్యం

రాజానగరం: డిప్లమా కోర్సుగా ప్రారంభమైన పల్మనాలజీ/రెస్పిరేటరీ మెడిసిన్ నేడు సూపర్ స్పెషాలిటీ, సబ్ స్పెషాలిటీ కోర్సుల వరకు విస్తరించిందని, దీని ప్రాధాన్యత కోవిడ్ సమయంలో ప్రపంచానికి తెలిసిందని అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్టు సీమాంధ్ర (ఏపీఎస్‌ఏ) ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ అన్నారు. శ్వాస, ఊపిరితిత్తుల అనారోగ్యాల ధోరణులను, పరిష్కారాలను చర్చించే రాష్ట్రస్థాయి పల్మనాలజిస్టుల సదస్సు స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. ఏపీఎస్‌ఏ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది పల్మనాలజీ వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొంటున్నారని ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. సైంటిఫిక్ పేపర్లు, పోస్టర్లు, సెమినార్లు, కొత్త పరికారాలపై శిక్షణ ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.రాజేంద్ర కుమార్ అన్నారు.

ఓటరు జాబితా సవరణలో జాప్యంపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఆర్డీవో చైత్రవర్షిణి

సీతానగరం: మండలంలో నలభై శాతం ఓటర్ల పరిశీలన జరగలేదని, ఇలా అయితే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఆర్డీవో, ఆర్‌వో చైత్రవర్షిణి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలు, సూపర్ వైజర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల విషయమై బీఎల్వోలకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు కనీస అవగాహన లేకపోవడంపై ఆమె అసహనానికి గురయ్యారు. జాబితాలో సవరణలు తప్పుల తడకలతో జరిగినట్లు గుర్తించారు. దానిపై వివరణ కోరంగా సరైన సమాధానం చెప్పకపోవడంతో చినకొండేపూడి వీఆర్వో, బీఎల్‌వో, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజుకు ఆదేశించారు. ఈనెల 21 నాటికి మండలంలో పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీవో కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం.. సేవల్లో ఘనం

- ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన
- అందుబాటులో అన్ని సేవలు

మధురపూడి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు వచ్చి చేరుతున్నాయి. ముఖ్యంగా సచివాలయాలు స్థానికంగా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నాయి. ప్రజల సమస్యల పరిష్కార కేంద్రాలుగా నిలిస్తున్నాయి. గతంలో మండల కేంద్రాలకు వెళితే తప్ప పరిష్కారానికి నోచుకోని సమస్యలు, నేడు అత్యంత సులభంగా గ్రామ సచివాలయాల్లో పరిష్కారం అవుతున్నాయి. దళారుల మోసాలకు గురి కాకుండా ప్రజలు, రైతులు స్థానిక సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 78 సచివాలయాలున్నాయి. అలాగే అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట, అనపర్తి, బిక్కవోలు మండలాల్లో 59 సచివాలయాలున్నాయి.

గ్రామీణాభివృద్ధికి దోహదం

దేశానికి పట్టుకొమ్మలైన పల్లెల అభివృద్ధికి సచివాలయాలు దోహదపడుతున్నాయి. పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, కనీస సదుపాయాలు సమకూర్చడం జరుగుతోంది. ప్రజలకు ఆర్థికంగా స్వావలంబన



బూరుగుపూడిలో సచివాలయ భవనం

లభిస్తోంది. ప్రజలు సమస్యల పరిష్కారం, ఇతర అవసరాల కోసం మండల కేంద్రాల్లోని అధికారుల కార్యాలయాలకు వెళ్లకుండా సమయం, నగదును ఆదా చేస్తున్నాయి.

సేవలకు వందనం

సచివాలయాలు ప్రజలకు సేవలు అందించడంలో కీలకంగా మారాయి. వీటి ద్వారా 542 రకాల సేవలను అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో భవిష్యత్తు తరాలకు అక్కరకొచ్చే విధంగా సచివాలయాలను నిర్మించింది. దీని ద్వారా అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో ప్రధానమైనది ఆధార్ అప్‌డేషన్. దేశవ్యాప్తింగా అత్యంత ముఖ్యమైన ఈ సేవ సచివాలయంలో అందుబాటులోకి వచ్చింది. అలాగే కులం, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు, భూ సమస్యలకు పరిష్కారాలు లభిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత దూర దృష్టితో సమాచార హక్కు వ్యవస్థను అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. దీనిని సచివాలయాల ద్వారా పొందడానికి అనువైన పరిస్థితి తీసుకొచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నిరంతర సేవలు



సచివాలయ వ్యవస్థ నిరంతర సేవలో భాగంగా రోజూ 50 వరకూ సేవలను అందిస్తోంది. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరిస్తోంది. సచివాలయాల సేవల కారణంగా స్పందనకు వినతులు తగ్గాయి.

– పీఎస్ నరేష్ కుమార్, ఎంపీడీఓ, కోరుకొండ

పారదర్శకత



సచివాలయ వ్యవస్థలో సమాచార హక్కు చట్టాన్ని పొందేందుకు అవకాశం కల్పించడం పారదర్శకతకు నిదర్శనం. ఎటువంటి లోపాలు, పొరపాట్లు లేకుండా స్వచ్ఛమైన పాలనను అందించే నాయకుడే ఈ చట్టాన్ని అందుబాటులోకి తీసుకురాగలుగుతారు. జగనన్న మాట తప్పని, మడం తిప్పని నాయకుడు కావడంతో ఈ మార్పులు చేశారు.

– కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహామండలి సభ్యుడు, బూరుగుపూడి

ఉద్యాన రైతులకు రాయితీలు



రినీ, ఉద్యాన శాఖ మండలాధికారి

మధురపూడి: ఉద్యాన వనాల విస్తృతి, రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించిందని ఆ శాఖ కోరుకొండ మండలాధికారి రినీ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండ, సీతానగరం మండలాల్లో పండిస్తున్న శనగలు, మిర్చి, చింతపండు తదితర వాటిని నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రైతులకు 75 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రైతులు సంఘంగా ఏర్పడి దీన్ని దక్కించుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజీ యూనిట్‌కు రూ.15 లక్షలు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న 75 శాతం సబ్సిడీతో రైతు సంఘాలు రూ.3,75,000 చెల్లించాలన్నారు. పండ్ల తోటలకు సాగునీరందించే నల్ల పైపులను ఏపీఎంఐపీ ద్వారా 50 శాతం సబ్సిడీకి పొందవచ్చన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లకు 90 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. పొలం గట్లపై వేసుకునేందుకు కొబ్బరి మొక్కలను రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. హైబ్రీడ్ కొబ్బరి మొక్కలను 50 శాతం సబ్సిడీతో పొందవచ్చన్నారు. వీటిని పశ్చిమగోదావరి జిల్లా వేగిమూడి నుంచి తీసుకోవాలన్నారు. మొక్కలను తెచ్చుకున్న అనంతరం ఆ బిల్లు ఆధారంగా సబ్సిడీని ఉద్యానవన శాఖ ద్వారా పొందవచ్చన్నారు. పండ్లతోటల రైతులు ప్రాథమికంగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

వేగంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు



జగనన్న కాలనీలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

పెదపూడి: జగనన్న శాశ్వత భూ హక్కు రీసర్వేకు సంబంధించి గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు వేగంగా చేపట్టాలని కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. ఆయన శుక్రవారం పెదపూడిలో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి తహసీల్దార్‌తో చర్చించారు. ఆర్డీఓ సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ డివిజన్‌లో 121 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారన్నారు. పెదపూడి మండలంలో 12 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ గ్రామాల్లో 70 శాతం సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమం పూర్తి చేశారని, ఇంకా 30శాతం మేర రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అనంతరం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు నిర్మాణాలు ఎలా నిర్మిస్తున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. తహసీల్దార్ టి.సుభాష్, డిప్యూటీ తహసీల్దార్ రామ్ కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి, సర్వేయర్ మూర్తి, వీఆర్వోలు చండి, కరెడ్ల రమేష్ పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న యువకుడు

అనపర్తి: రక్తదానం చేయటాన్ని సమాజంలో ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ అధికారి డాక్టర్ పి.రమేష్‌కిషోర్ అన్నారు. మండలంలోని కుతుకులూరులో సంజీవ్ అండ్ జాజి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వాలీబాల్ గ్యాంగ్ సభ్యుల సమన్వయంతో కర్రి దుర్గాప్రసాదరెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించి డాక్టర్ రమేష్‌కిషోర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినపుడు, మహిళలకు ప్రసవ సమయంలో, రోగులకు శస్త్ర చికిత్సల సమయంలో రక్తం చాలా అవసరమని, ఇటువంటి సమయాల్లో రక్తదానం చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో అనపర్తి జీబీఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులతోపాటు సుమారు 120 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాజమహేంద్రవరం సంజీవని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. సర్పంచ్ గొల్లు హేమతులసి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చాందినీకుమార్, యూత్ సభ్యులు కొవ్వూరి మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సొసైటీల బలోపేతానికి ప్రభుత్వం కృషి



కొప్పవరం సొసైటీ చైర్ పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మంగిరెడ్డిగారి శ్రీను

అనపర్తి: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ సత్తి నాగిరెడ్డి(రాజా) అన్నారు. మండలంలోని కొప్పవరంలో గల బుచ్చన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి ప్రభుత్వం నూతనంగా నియమించిన పాలకవర్గం (త్రీ మెన్ కమిటీ) ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. సొసైటీ చైర్‌పర్సన్‌గా కొప్పవరం గ్రామానికి చెందిన పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి(మంగిరెడ్డిగారి శ్రీను), పర్సన్స్‌గా మండలంలోని మహేంద్రవాడకు చెందిన మల్లిడి ఆదిరెడ్డి, మిడతాని బంగారయ్య ప్రమాణ స్వీకారం చేశారు. పీఏసీఎస్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని నాగిరెడ్డి మాట్లాడుతూ పీఏసీఎస్‌ల ద్వారా గ్రామస్థాయిలోనే రైతులకు అన్ని రకాల సేవలు పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యంగా నూతన పాలకవర్గం కృషిచేయాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన సొసైటీ చైర్ పర్సన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొప్పవరం, లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ గ్రామాల రైతులకు మెరుగైన సేవలు అందించి సొసైటీని ఆదర్శవంతంగా నిలిపేందుకు కృషిచేస్తానన్నారు. గ్రామ సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, మహేంద్రవాడ ఉపసర్పంచ్ మల్లిడి గంగరాజు, ఎంపీటీసీ సభ్యులు సబ్బెళ్ల వెంకటరెడ్డి, పడాల ధర్మారెడ్డి, కొప్పవరం మాజీ సర్పంచ్ తాడి వెంకటరామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి, సొసైటీ మాజీ చైర్‌పర్సన్ కర్రి వెంకటనారాయణరెడ్డి, కేవీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ తేతలి నవీన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పోతంశెట్టి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, నాయకులు

పెదపూడి: పేదరికమే ప్రామాణికంగా తీసుకుని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 49 నెలలుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ గడపకు వెళ్లినా మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే మా కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలు చెబుతున్నారన్నారన్నారు. జగనే మా కుటుంబాలకు ధైర్యం, మా పిల్లల భవిష్యత్తుకు భరోసా, రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి అని ఆనందంతో కొనియాడుతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణయుగ పాలన నడుస్తోందన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, అనపర్తి నియోజకవర్గం పంచాయతీ విభాగం అధ్యక్షుడు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పైన గ్రామ పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజా నేటి షెడ్యూల్

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నంలో శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పర్యటిస్తారు. 11.30 గంటలకు రాజానగరంలోని ఒక కాలేజీలో జరిగే ప్రైవేట్ ఫంక్షన్‌లో పాల్గొని, మధ్యాహ్నం 12 గంటలకు జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరుగుతున్న పల్మనాలజీ సదస్సుకు హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 9.30 వరకు కోరుకొండ మండలం కనుపూరులో జరిగే గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారు.

స్వయం శక్తితో ప్రగతి సాధించాలి

రాజానగరం: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మీరు దాచుకుంటున్న నిధులతో సరైన స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థికంగా ప్రతి మహిళ ఎదగాలని సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్ సూచించారు. స్థానిక మండల మహిళ సమాఖ్య భవనంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో శుక్రవారం జరిగిన సమావేశంలో పొదుపుతో అభివృద్ధిని ఏ విధంగా సాధించవచ్చునో వివరించారు. ముందుగా ప్రతి సంఘం బలోపేతంగా ఉండాలన్నారు. పొదుపు సొమ్ములతోపాటు స్త్రీనిధి, సీఐఎఫ్, బ్యాంకు రుణాలతో జీవనోపాధిని ఎంచుకోవాలన్నారు. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా జీరో వడ్డీ సదుపాయాన్ని పొందడంతోపాటు ఆయా బ్యాంకుల నమ్మకాన్ని, తద్వారా అధిక మొత్తంలో రుణాలను అందుకోవచ్చన్నారు. సమావేశంలో స్త్రీనిధి ఎండీ నాంచారయ్య, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, సెర్ఫ్ బ్యాంక్ లింకేజి డీపీఎ కేశవ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



దోమాడలో నా భూమి -నా దేశం కార్యక్రమంలో దీపం వెలిగిస్తున్న ఎంపీడీవో తదితరులు

రంగంపేట: మండల పరిధిలోని ముకుందవరం, వడిశలేరు గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఆజాదీ కా అమత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ముకుందవరం ఎంపీపీ స్కూల్ వద్ద, వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ముకుందవరం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ వట్టికూటి వెంకట సూర్యపద్మ, వడిశలేరులో సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు చెరువు గట్లపైన, పాఠశాలల ఆవరణలోను కొబ్బరి మొక్కలు నాటారు. సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నలమాటి భీముడు, ఎంపీడీఓ బి. శ్రీరామరాజు, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం ఆవిష్కరణ

పెదపూడి: ఉత్సాహంగా నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం కార్యక్రమం అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. దోమాడ, పెదపూడి, పెద్దాడ తదితరులు గ్రామాల్లో శుక్రవారం నాభూమి, నాదేశం వీరులకు వందనం ఆజాది కా అమృత్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన అమవీరుల స్తూపం, జెండాను ఆవిష్కరించారు. మొక్కలు నాటారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. దీపాలు వెలిగించారు. సర్పంచులు మీనవల్లి శారదదేవి, డొకుబుర్ర మీనాక్షి పాల్గొన్నారు.

రాజానగరం మండలంలో..

రాజానగరం: ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చక్రద్వారబంధంలో శుక్రవారం నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని నిర్మించి, మట్టితో పంచప్రాణ ప్రతిష్ఠ చేసి, దేశాభివృద్ధికి పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. తొలుత భరతమాత, గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు.

మణిపూర్ ఘటనకు కేంద్రం బాధ్యత వహించాలి

గోకవరం: మణిపూర్ ఘటనకు కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం మణిపూర్ ఘటనకు నిరసిస్తూ సమావేశం నిర్వహించారు. తొలుత ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ మణిపూర్‌లో గత రెండు నెలలుగా హింస, మారణకాండ జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. ఆదివాసీలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారన్నారు. మణిపూర్ అల్లర్లకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో డి.సురేష్, శ్రీకాంత్, గోలి ముసలయ్య, గుడిసె అబ్బు, కడాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..



జంబూపట్నంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు జరుపుతున్న నవరత్నాల పథకాలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామంలో శుక్రవారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ జంబూపట్నం అభివృద్ధికి విశేష కృషి చేశామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. తమ ప్రభుత్వంలో నాలుగేళ్లలో రూ.3.10 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్త జంబూపట్నం, పాత జంబూపట్నంలో 300 గడపలు తిరిగారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి, జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, మండల కోకన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, నాయకులు ఉల్లి చెల్లారావు, నాగా సత్తిబాబు, ఉల్లి గణ, నాగా రమేష్, గొల్లపల్లి ప్రవీణ్, ఈతకోట చినబాబు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ పూర్తి

సీతానగరం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లు ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యిందని మండల సహాయ ఎన్నికల అథారిటీ కేవీఎస్ఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. నాగంపల్లి పంచాయతీ ఒకటో వార్డుకు నలుగురు నామినేషన్లు వేశారు. వాటిలో ఒకటి పరిశీలనలో తొలగించగా, దూళ్ల సుబ్రహ్మణ్యం, దోసపాటి కాశీ కృష్ణ భగవాన్, ఈత సత్యనారాయణ ప్రసాద్ బరిలో ఉన్నారన్నారు. రాపాక పంచాయతీ 7వ వార్డులో మాగంటి నాగమణి, రఘుదేవపురం ఒకటో వార్డులో కోండ్రు బుజ్జి నామినేషన్లు వేశారన్నారన్నారు. శని, ఆదివారాల్లో అప్పీలకు వెళ్లవచ్చని, సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు విత్‌డ్రా అవ్వడానికి అవకాశం ఉందన్నారు. కాగా.. నాగంపల్లి పంచాయతీ వార్డు మెంబరు ఎన్నిక ఏకగ్రీవమైందని సమాచారం.

మినిమల్ ఎక్సెస్ సర్జరీపై శిక్షణ



మాస్ ట్రైనింగ్ యూనిట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ

రాజానగరం: శరీరంపై వీలైనంత కోత/రంధ్రం పెట్టి చికిత్స చేసే మినిమల్ ఎక్సెస్ సర్జరీ (ఎంఏఎస్) విధానంపై మూడు రోజులు నిర్వహించే శిక్షణ శుక్రవారం స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఐఏజీఈఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినల్ ఎండో సర్జన్స్ (ఐఏజీఈఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.ఈశ్వర మూర్తి మాట్లాడుతూ కాలేజీలలో అందుకున్న డిగ్రీలతో పాటు వైద్యసేవలో అనుభవాలు, అవగాహనపై సదస్సులలో చర్చించి, పరీక్షలు నిర్వహించిన తరువాతనే యోగ్యత సాధించిన వారికి ఫెలోషిప్‌లు ప్రదానం చేస్తామన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు వంద మంది వరకు సర్జరీ పీజీ విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఈ బేసిక్ లాప్రోస్కోపీ, ఎగువ పేగులు, ఎండోస్కోపీ ప్రొసీజర్లు, కుట్లు వేయడంలో శిక్షణ ఉంటుందన్నారు. మాస్ ట్రైనింగ్ యూనిట్లను స్వయంగా పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ, జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సర్జరీ హెడ్ డాక్టర్ సమీర్ రంజన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.